ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 27 జూన్ 2024



మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యం
- రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ 8



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

ఇంటింటా చెత్త సేకరణ జరపాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష 8



అర్హులకు అందని గృహజ్యోతి

- కొత్తగా దరఖాస్తులు స్వీకరించని ప్రభుత్వం
- సవరణకు అవసరసరమైన ఆప్షన్లు ఇవ్వక ఇక్కట్లు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రజాపాలన ద్వారా దరఖాస్తు చేసుకున్న పలువురు అర్హులకు గృహజ్యోతి పథకం వర్తించడం లేదు. దీంతో సదరు దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని అంశాల సవరణకు అవకాశం కల్పించిన ప్రభుత్వం మరికొన్ని అంశాలకు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోలేని వారి నుంచి కొత్తగా దరఖాస్తులు స్వీకరించడం లేదు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, సంబంధిత అధికారులు మాత్రం దరఖాస్తులు స్వీకరించడం లేదని ప్రజలు చెబుతున్నారు. గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలతో పాటు పలు పథకాలను అమలు చేస్తామని ప్రకటించింది. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, చేయూత గ్యారంటీ పథకాల అమలు కోసం డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు 266 గ్రామ పంచాయతీల్లో ఒక మున్సిపల్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీల పరిధిలోని 114 డివిజన్లు, వార్డుల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామాల్లో 1,61,195, పట్టణాల్లో 70,146, మొత్తం 2,31,341 దరఖాస్తులు వచ్చాయి. ఇవేగాకుండా రేషన్ కార్డులు, ఇతరత్రా గ్రామాల్లో 1,92,072, పట్టణాల్లో 77,389 దరఖాస్తులు వచ్చాయి. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు 2,500 రూపాయలు వేస్తామని, 500 రూపాయలకే వంట గ్యాస్ ఇస్తామని ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం డిసెంబరు 9వతేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం కింద ఎకరానికి రెండు పంటలకు కలిపి 15 వేలు, కౌలు రైతులకు 15 వేలు, కూలీలకు 12 వేలు ఇస్తామని ప్రకటించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి 5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. డిసెంబరు 9 నుంచి మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 5 నుంచి 10 లక్షల రూపాయల వరకు వర్తింపజేస్తున్నారు. మార్చి నెల నుంచి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం, 500 రూపాయలకే వంటగ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నారు.

● వినియోగదారుల ఇబ్బందులు..

గృహజ్యోతి పథకం కింద జిల్లాలో అర్హులైన 1,10,346 కుటుంబాలకు ఏడు కోట్ల 64 లక్షల సబ్సిడీ భరించి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నారు. 96,500 కుటుంబాలకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నారు. అయితే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న చాలా మందికి గృహజ్యోతి వర్తించడం లేదు. మార్చి 16వ తేదీ నుంచి పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో మూడు నెలల పాటు ప్రభుత్వం నుంచి లభించే సబ్సిడీ ప్రయోజనాలను కోల్పోయారు. గృహజ్యోతికి సంబంధించి ఆప్షన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కేవలం ఒకటి, రెండు మాత్రమే వచ్చాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఉండి గృహజ్యోతి వద్ద ఎస్ అని పెట్టి మీటర్ నంబర్ రాయకుంటే మాత్రమే ప్రస్తుతం నంబర్ చేర్చడంతో పాటు సెల్ నంబర్లు సవరించుకునే అవకాశం కల్పించారని చెబుతున్నారు. కొందరు విద్యుత్ ఆపరేటర్లు వినియోగదారులకు సంబంధించి ఒక ఇంటిలో రెండు మీటర్లు ఉంటే రెండు నంబర్లు నమోదు చేయడంతో తక్కువ బిల్లు వస్తున్న మీటర్‌కు మాత్రమే గృహజ్యోతి వర్తిస్తున్నది. ఎక్కువ బిల్లు వచ్చే మీటర్‌కు సబ్సిడీ రావడం లేదు. ఈ విషయమై మీటర్ నంబర్ మార్పిడి చేసుకునే అవకాశం లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ కనెక్షన్ల నంబర్ నమోదు చేయని వారికి అవకాశం కల్పిస్తున్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించక పోగా, అద్దె భవనాల్లో నివాసం ఉంటున్న కొంత మందికి గృహజ్యోతి వర్తింపజేయడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్తగా దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ఆన్‌లైన్ కావాల్సిన సవరణలు ఇచ్చి అర్హులైన వారికి గృహజ్యోతి వర్తింప జేయాలని వివిధ వర్గాల ప్రజలు, పార్టీల నాయకులు కోరుతున్నారు.

గృహజ్యోతి, గ్యాస్ వర్తించడం లేదు..

- నేదునూరి కిషన్‌రావు, పెద్దపల్లి



నేను పెద్దపల్లి పట్టణంలోని మిషన్ హైస్కూల్ ఏరియాలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నాను. ఇంటి యజమాని వేరే ప్రాంతంలో ఉంటారు. నేను అద్దెకు ఉంటున్న ఇంటి మీటర్‌కు సబ్సిడీ కోసం, వంట గ్యాస్ సబ్సిడీ కోసం డిసెంబరులోనా భార్య సవితా రాణి పేరిట ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను. కానీ నాకు గృహజ్యోతి వర్తించడం లేదు. గ్యాస్ సబ్సిడీ రావడం లేదు. ఈ విషయమై మున్సిపాలిటీకి వెళ్లి అడిగితే ఆప్షన్లు రావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ పథకాలు వర్తింపజేయాలని కోరుతున్నా.

విధుల్లో నిర్లక్ష్యం.. ఆర్‌అండ్‌బీ ఏఈ సస్పెన్షన్

పెద్దపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి)/కోల్‌సిటీ: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహించినందుకు గానూ రామగుండం రోడ్లు భవనాల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎండీ జావిద్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ బుధవారం రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని రామగుండం జెడ్‌పీ హైస్కూల్, మండల పరిషత్ పాఠశాల, ఎన్‌టీపీసీ అన్నపూర్ణకాలనీలోని దుర్గయ్యపల్లి పాఠశాల, గోదావరిఖని గాంధీనగర్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గతంలో కలెక్టర్ ఆదేశించినా నిర్లక్ష్యం వహించారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యుడైన ఏఈని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లడానికి వీలులేదని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భూ సేకరణ అభ్యంతరాలను పరిష్కరించాలి

పెద్దపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల-వరంగల్ మధ్య నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై వచ్చే అభ్యంతరాలను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మంచిర్యాల- వరంగల్ మధ్య 4 వరుసల గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి పెద్దపల్లి జిల్లాలో 204.46 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉండగా, ముందస్తుగా ఫిబ్రవరి 23న 152.26 హెక్టార్ల భూమి నోటిపై చేసి పబ్లిక్ నోటీస్ 1 జారీ చేశామని, 60 రోజుల గడువు ముగిసిన తర్వాత మే 8న పబ్లిక్ నోటీస్ 2 విడుదల చేశామని తెలిపారు. మంచిర్యాల-వరంగల్ మధ్య 4 వరుసల గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణం కారణంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో మంథని ఆర్డీవో హనుమానాయక్, డీఎఫ్‌వో శివయ్య, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఆర్‌అండ్‌బీ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి జూలై 4 వరకు డీఏవో పరీక్ష

- అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ

పెద్దపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జూన్ 30 నుంచి జూలై 4 వరకు డివిజనల్ అకౌంట్స్ అధికారి(డీఏవో) పరీక్షలను నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించనున్న డీఏవో పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సీబీఆర్‌టీ (కంప్యూటర్ బేసిడ్ రిక్రూట్మెంట్ టెస్టు) విధానం ద్వారా జూన్ 30 నుంచి జూలై 4 వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్ లలో పరీక్షల నిర్వహణ ఉంటుందని అన్నారు. అభ్యర్థులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల గేటు ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు మూసివేయడం జరుగుతుందని, గేటు మూసివేసిన తర్వాత ఎవరిని పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించమని తెలిపారు. స్క్రైబ్/కాంపెన్సేటరీ టైం ఆశించే దివ్యాంగ అభ్యర్థులు తమ సదరన్ సర్టిఫికెట్/అపెండిక్స్‌లను తీసుకుని వచ్చి పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్‌కు పరీక్షరోజు సమర్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

వేధిస్తే సమాచారం ఇవ్వండి: షీ టీమ్ ఎస్ఐ

కోల్‌సిటీ, జూన్ 26: విద్యార్థినిలను ఎవరైనా వేధిస్తే తమకు సమాచారం ఇవ్వాలని షీటీమ్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్ విద్యార్థినులకు సూచించారు. బుధవారం అశోకనగర్‌లోని ఉర్దు మీడియంలో విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే 6303923700 వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సురేష్, స్నేహలత పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలి

కమాన్‌పూర్, జూన్ 26: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారికి సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామపంచాయతీ కార్మికులకు సకాలంలో జీతాలు పడకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్‌గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, సిద్దిపల్లె మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుర్రం లక్ష్మీమల్లు ఉన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

ఓదెల, జూన్ 26: మండల పరిషత్ కార్యాలయంలో 28న, రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, వివిధ శాఖల మండల, జిల్లాస్థాయి అధికారులు, ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

సుల్తానాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, జూన్ 26: సుల్తానాబాద్ పట్టణ సమగ్రాభివృద్ధికి 11 కోట్ల రూపాయలతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండల పరిషత్ నిధులు రూ 25 లక్షలతో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు సుల్తానాబాద్ పట్టణం వ్యాపారపరంగా దినదినాభివృద్ధి చెందుతుందని జనాభా అవసరాలకు తగ్గట్లు పట్టణాన్ని కూడా అభివృద్ధి పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతామని ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. రానున్న రోజుల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ ముద్దసాని సుధీర్‌రెడ్డి సమకూర్చిన స్కూల్ బ్యాగులను, నోటు బుక్కులను ఆయన విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాశ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎలిగేడు: కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి కృషిచేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని శివపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త ముందుచూపుతో పనిచేయాలన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు దుగ్యాల సంతోష్ రావు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి: కలెక్టర్

కళ్యాణ్‌నగర్, జూన్ 26: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యులకు సూచించారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఓపీ విభాగాన్ని, ఐసీయూ, జనరల్ వార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదగా నడుచుకోవాలని, సకాలంలో వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, ఆర్ఎంవో అప్పారావు, ప్రొఫెసర్లు ఉన్నారు.

● ఖని ప్రభుత్వ పాఠశాల తనిఖీ

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఎక్కువ మంది విద్యార్థులకు 10/10 జీపీఏ వచ్చే విధంగా చూడాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్ పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంఈవో రాజయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఇ చిన్నారావు, ఈఈ రామన్, ఏఈ పంచాయతీ రాజ్ జావిద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోదావరిఖని ప్రభుత్వ పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్

● మనోచైతన్య కేంద్రం సందర్శన..

గోదావరిఖనిలోని మానసిక వికలాంగు వృత్తి విద్యా శిక్షణ ఉపాధి కేంద్రం మనోచైతన్యను కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం సందర్శించారు. కేంద్రంలోని అన్ని విభాగాలను, పనితీరును తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత, మనోచైత న్య అధ్యక్షుడు డి.కృష్ణకుమార్, సీడీపీవో స్వరూపరాణి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి

పెద్దపల్లి రూరల్, జూన్ 26: ప్రస్తుత తరుణంలో సైబర్ నేరాల ఊబిలో పడి చాలా మంది నష్టపోతున్నారని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. బుధవారం మండలంలోని అప్పన్నపేటలో సైబర్ నేరాలను ఎలా గుర్తించాలనే అంశాలపై వివరిస్తూ ముద్రించిన ఫ్లెక్సీని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వామి పరిశీలించి ఫ్లెక్సీపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంట కానిస్టేబుల్ కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి, అప్పన్నపేట, కుక్కలగూడూర్, బసంత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం స్థానిక ఎస్ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో సిబ్బంది సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించే ఫ్లెక్లీలను ఏర్పాటు చేశారు.

మల్లన్న సన్నిధిలో ఆర్డీవో పూజలు

ఓదెల, జూన్ 26 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆర్డీవో గంగయ్య బుధవారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అర్చనలను నిర్వహించారు. అనంతరం ఆలయ సాంప్రదాయకంగా ఆర్డీవోను సిబ్బంది సన్మానించి, ఆలయ జ్ఞాపికను అందజేశారు. అలాగే వివిధ మండలాల నుంచి తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులు తీర్చుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీపీ బండారి స్రవంతి - సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీపీ, జడ్పీటీసీ

పెద్దపల్లి రూరల్, జూన్ 26: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలు, అధికారులకు ఎంపీపీ బండారి స్రవంతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయం పరిధిలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని కనగర్తి ఎంపీటీసీ ఎడెల్లి శంకర్ సభ దృష్టికి తీసుకెళ్లారు. కాపులపల్లిలో మహిళ సంఘాల రుణాలను స్వాహా చేసి మూడేళ్ల గడుస్తున్నా ఇప్పటివరకు విచారణ చేపట్టకపోవ డంతో పాటు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బండారి స్రవంతి మాట్లాడుతూ మండలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉడాలనిలని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీటీసీ రామ్మూర్తి, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్‌లు చింతపండు సంపత్, మాదిరెడ్డి నరసింహారెడ్డి, పలుశాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



యువకుడి అనుమానాస్పద మృతి


శివారెడ్డి (ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 26 : కరీంనగర్ లోయర్ మానేర్ డ్యాం నీటి గుంతలో ఒక యువకుడు అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం చింతకుంటలోని గ్రీన్‌హోమ్స్‌లో నివాసం ఉంటున్న సామ శివారెడ్డి(26) మంగళవారం రాత్రి పద్మనగర్ ప్రాంతంలోని ఒక ప్రైవేట్ స్కూల్ వెనుక వైపున జలాశయంలోని పెద్ద నీటి గుంతలో పడి మృతి చెంది ఉన్నాడు. చింతకుంటలో తన తండ్రి నిర్వహిస్తున్న సర్వీసింగ్ సెంటర్‌లో ఉన్న శివారెడ్డిని మంగళవారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో అతడి స్నేహితుడు నిశాంత్ బైక్‌పై తీసుకు పోయాడని, ఆ తరువాత 8 గంటల ప్రాంతంలో శివా రెడ్డికి తన తల్లి ఫోన్ చేయగా అరగంటలో వస్తున్నట్లు తెలిపాడని, మళ్లీ 9:15 గంటలకు ఫోన్ చేసినట్లు మృతుడి తండ్రి సత్యారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొద్దిసేపటి తరువాత మృతుడి సోదరుడు ఉదయ్‌రెడ్డికి నిశాంత్ అనే యువకుడు ఫోన్ చేసి శివారెడ్డి ప్రమాదవశాత్తు నీటి గుంతలో జారి పడి మృతి చెందాడని చెప్పినట్లు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులంతా సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ ఉన్న శివారెడ్డి స్నేహితులను అడగగా సరైన సమాధానం ఇవ్వలేదని, శివారెడ్డికి ఈతవచ్చని పేర్కొన్నారు. గతంలో నిశాంత్‌కు శివారెడ్డికి మధ్య డబ్బుల గొడవ ఉందని, తన కొడుకు మరణంపై అనుమానాలున్నాయని మృతుడి తండ్రి సత్యారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు శివారెడ్డి హైదరాబాద్‌లో ఒక కృత్రిమ అవయవాల తయారీ సంస్థలో పనిచేస్తున్నాడని, రెండు రోజుల కిందటే చింతకుంటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. శివారెడ్డితో పాటు సంఘటన స్థలంలో ఉన్న అతడి స్నేహితులు ముగ్గురు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

బీఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 26: శాతవాహన విశ్వవిద్యాలయంలో మేలో నిర్వహించిన బీఫార్మసీ (సీబీసీఎస్) 3,4,5,6, సెమిస్టర్ల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జూన్ 26: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ, రెండో, నాలుగవ, సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 12మంది విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. స్వామి వివేకానంద డిగ్రీ కళాశాల ధర్మారంలో ముగ్గురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, కోరుట్లలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెట్‌పల్లిలో ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల మహదేవ పూర్‌లో ఆరుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలిపారు.

ఎలక్ట్రానిక్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్

రూ. 3 లక్షల సామగ్రి దగ్ధం

కోరుట్ల, జూన్ 26 : పట్టణంలోని గాంధీ రోడ్డులోని ఎలక్ట్రానిక్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం అయినట్లు దుకాణం యజమాని ఎడ్డెలి సత్యనారాయణ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం షాపులో ఉన్న సామగ్రి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పిందన్నారు. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు యజమాని సత్యనారాయణ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సుభాష్‌నగర్, జూన్ 26: గన్నేరువరం మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ వీరయ్య బుధవారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కాలుజారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తర లించి మెరుగైన చికిత్స కోసం చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో చేర్పించారు. వీర య్యను సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరశురాంగౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్యగౌడ్‌లు పరామర్శించారు.

నకిలీ వీసాతో మోసం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
● కేసు నమోదు చేసిన పోలీసులు

మల్యాల, జూన్ 26: నకిలీ వీసాతో మోసం చేసిన హైదరాబాద్‌కు చెందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు మల్యాల ఎస్సై-2 కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన జుట్టు శ్రీకాంత్‌ను ఉద్యోగం కోసం పోలండ్ పంపిస్తామని హైదరాబాద్‌కు చెందిన మావిల్లపల్లి అభిలాస్‌రెడ్డి అనే వ్యక్తి రూ.3లక్షలు తీసుకున్నాడు. అక్కడ ప్రస్తుతం ఉద్యోగాలు లేవని ఫ్రాన్స్ పంపిస్తానని చెప్పి నకిలీ వీసా అప్పగించి మరో రూ.50వేలు వసూలు చేశాడు. అయితే ఆ వీసాతో ఈ నెల 12న ముంబైలోని ఏయిర్‌పోర్టుకు వెళ్లగా అక్కడ ఇమ్మిగ్రేషన్ అధికారులు అది నకిలీ వీసా అని శ్రీకాంత్‌ను పోలీసులకు అప్పగించారు. దీంతో అతను ఇప్పుడు జైల్‌లో ఉండగా అభిలాష్‌రెడ్డిపై అతని తండ్రి లింగారెడ్డి మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అభిలాష్‌రెడ్డిపై ఇమ్మిగ్రేషన్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. శ్రీకాంత్‌తో పాటు మల్యాలకు చెందిన రఫీక్‌ఖాన్, ముదాం నాగరాజ్‌తో పాటు పలువురిని మోసం చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

గుడంబా స్థావరాలపై పోలీసుల దాడులు


గుడంబా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ సందీప్‌కుమార్, సిబ్బంది

రామగిరి, జూన్ 26: మండలంలోని బేగంపేట్ గ్రామశివారులోని కంచల చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన గుడంబా స్థావరాలపై ఎస్ఐ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 12వేల లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని ధ్వంసం చేశారు. గుడంబా తయారు చేసి, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు, కాని స్టేబుల్స్ సదానందం, రవి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

మెట్‌పల్లి, జూన్, 26: ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని రిమాండ్‌కు తరలించి నట్లు బుధవారం ఎస్సై చిరంజీవి తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన మహ్మద్ జుబేర్‌ఖాన్ ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఈ నెల 24న మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందినట్లు తెలిపారు. సీఐ నిరంజన్‌రెడ్డి విచారణ చేపట్టి జుబేర్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తికి జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జూన్ 26: భర్త వేధింపులు భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడైన భర్త మాధవరావు సుమన్ (38)కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ ఆర్ శ్రీలేఖ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గుంటూరు జిల్లా తెనాలి మర్సిపేటకు చెందిన మన్నవరాణిని అదే జిల్లా వేమురు మండలం వరాహపురంకు చెందిన మాధవరం సుమన్‌తో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. 2017లో బతుకుదెరువు కోసం గంగాధర మండలం గర్షకుర్తికి వచ్చి స్థిరపడ్డారు. కొద్ది రోజుల తర్వాత తాగుడుకు బానిసై భార్యను వేధించడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో సాక్షులను విచారించిన జడ్జి శ్రీలేఖ నిందితుడికి జైలు శిక్ష విధించారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెగడపల్లి,జూన్ 26: పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లి గ్రామానికి చెందిన మారుపాక లచ్చయ్య (70) అనే వృద్ధుడు బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. లచ్చయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ఎదుట గల గుడిసెలో ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


గంగాధర్ (ఫైల్)

పెగడపల్లి, జూన్ 26: పెగడపల్లి మండలంలోని బతికెపల్లి శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన బలుసు గంగాధర్ (31), ముంజ రాజు అనే యువకులు ఇరువురు ద్విచక్ర వాహనంపై పెగడపల్లి నుంచి సుద్దపెల్లికి వెళ్తుండగా బతికెపల్లి గ్రామ శివారులోని సుద్దపల్లి లింగాపూర్ గ్రామాలకు వెళ్లే నాలుగు రోడ్ల కూడలిలలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయాల పాలైన ఇద్దరిని గ్రామస్థులు జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే బలుసు గంగాధర్ మృతి చెందినట్లు తెలిపారు. ముంజ రాజు పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ ట్రక్ ఢీకొట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సంఘటనా స్థలాన్ని ఎస్.ఐ రామకృష్ణ సందర్శించి, ప్రమాదానికి కారణమైన వాహన ఆచూకీ కోసం సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

భవనంపై నుంచి పడి..

కరీంనగర్ క్రైం, జూన్ 26: సుభాష్‌నగర్‌లో మంగళవారం రాత్రి భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి పులి సుమన్ కుమార్(40) మృతి చెందాడని మూడో టౌన్ పోలీసులు తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న సుమన్‌కుమార్ మంగళవారం సాయంత్రం భార్య, పిల్లలతో రేకుర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చారు. ఇంటి ట్యాంక్‌లో నీరు లేకపోవటంతో మోటార్ ఆన్ చేసి, రెండో అంతస్థులోని ట్యాంక్ నిండిందో లేదో చూసి కిందకు దిగే క్రమంలో నీటి పాకురుతో ఉన్న చోట కాలు జారి కింద పడిపోయాడని మృతుడి తండ్రి రిటైర్డ్ ఎస్ఐ పులి నర్సింగం ఫిర్యాదు చేశారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించగా బుధవారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జగిత్యాలలో పర్మిట్ రూం వద్ద మందుబాబుల వీరంగం

ఒకరిపై కత్తితో దాడి

జగిత్యాల టౌన్, జూన్ 26: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఓ వైన్స్ పర్మిట్ రూం వద్ద మందుబాబులు వీరంగం సృష్టించారు. పర్మిట్ రూం నిర్వహించే వ్యక్తిపై కూరగాయలు కోసే కత్తితో దాడి చేయగా స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఓ వైన్స్ పర్మిట్ రూంలోకి పట్టణానికి చెందిన శేఖర్, పుల్లయ్య అనే ఇద్దరు వెళ్లి మద్యం సేవించారు. పర్మిట్ రూంలో ఉన్న కొంత ఫుడ్‌ను తీసుకున్నారు. అతిగా మద్యం సేవించిన అనంతరం బయటకు వెలుతున్న శేఖర్‌ను పర్మిట్ రూం నిర్వాహకుడు బిల్లు చెల్లించాలని కోరగా శేఖర్‌తో పాటు పుల్లయ్య అనే ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కౌంటర్‌పై ఉన్న కురగాయలు కోసే కత్తితో బెదిరించి దాడికి పాల్పడడంతో నిర్వాహకుడు రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

సిద్దిపేట క్రైం, జూన్ 26: సిద్దిపేట పట్టణంలో అంతర్ జిల్లా బైక్ దొంగను, అరెస్ట్ చేసి 19 బైకులను వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ వెల్లడించారు. పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో బుధవారం వన్ టౌన్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిజామాబాద్ జిల్లా మక్లూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన కుమ్మరి సాయి కుమార్ అనుమానాస్పదంగా కనపించాడన్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా అతడు పలు జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. అతడు కరీంనగర్ జిల్లా పరిధిలో మూడు, జగిత్యాల జిల్లా పరిధిలో ఒకటి, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ఒక బైక్ దొంగిలించాడని సీపీ తెలిపారు.

29 నుంచి హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్ ఓపెన్ సెలెక్షన్స్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 26: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్ ఓపెన్ సెలక్షన్స్‌ను ఈనెల 29,30 తేదీల్లో నిర్వహించనున్నారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.ఆగంరావు, మురళీధర్ రావులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల ఉమ్మడి జిల్లా మహిళా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌సీఏ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని పూర్తి యూనిఫాం, క్రికెట్ కిట్ బ్యాగ్‌తో ఉప్పల్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని వారు పేర్కొన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజురాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించడని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదాయం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమ్మీద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తన దన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కాహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యం

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ - అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ





మంథని, కాల్వశ్రీరాంపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, జూన్ 26: మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై బుధవారం గోదావరిఖనిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం టీ జంక్షన్ వద్ద నుంచి అవగాహన ర్యాలీని సీపీ జెండా ఊపి ప్రారంభించారు. టీ జంక్షన్ నుంచి ర్యాలీ ప్రధానచౌరస్తా వరకు కొనసాగింది. ర్యాలీలో విద్యార్థులు, ఎన్‌సీసీ కెడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నినాదాలు చేశారు. అనంతరం చౌరస్తాలో జరిగిన అవగాహన సభలో సీపీ శ్రీనివాస్ మాట్లాడారు. డ్రగ్స్ మాయలో పడి యువత వారి శక్తియుక్తులను వృథా చేసుకోవద్దని సూచించారు. యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సీపీ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ ఎం రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ అజయ్‌బాబు, టూటౌన్ సీఐ లింగమూర్తి, ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

మంథని: మత్తు జోలికి యువత వెళ్లదని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మంథని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటకృష్ణ పోలీస్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి బుధవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలు డ్రగ్స్ కు అలవాటు పడి తమ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని, వాటిని నిర్మూలించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: యువత గంజాయి మత్తులో పడితే జీవితాలు చిత్తు అవుతాయని ఎస్ఐ ఓంకార్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో కస్తూర్బా బాలికల విద్యార్థులతో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బస్టాండ్ వరకు సాగింది. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా గంజాయి కానీ, డ్రగ్స్ కానీ అమ్మినట్లు మీ దృష్టికి వస్తే మాకు సమాచారం అందించాలని ఎస్ఐ గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో కస్తూర్బా ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఏఎస్ఐ నీలిమ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సమాజంలో ఎంతో బంగారు భవిష్యత్ ఉన్న యువత కొందరు డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ మెహరాజ్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌లు, యువత పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు, ఏఎస్ఐ హన్మంతరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సదర్భంగా ఓదెలలో మిషన్ పరివర్తన ర్యాలీ నిర్వహించారు. మోడల్ స్కూల్ నుంచి గ్రామం వరకు విద్యార్థులు పోలీస్ సిబ్బంది ప్లకార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ జావేద్, పోలీస్ సిబ్బంది శ్రీనాథ్, రామకృష్ణ, రాజు, అశోక్, రాజేందర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగిరి: బంగారు భవిష్యత్ కలిగిన యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని మంథని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అనే అంశం పై బుధవారం మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి తెలంగాణ సెంటర్ వరకు విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది ఫ్లెక్సీలతో ర్యాలీ చేపట్టారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జేఎన్టీయూ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సందీప్‌కుమార్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

ముత్తారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ జూనియర్ కాలేజీ నుంచి అడవిశ్రీరాంపూర్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కమాన్‌పూర్: మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

● వ్యసనాలకు దూరంగా ఉండాలి: అదనపు కలెక్టర్..

పెద్దపల్లి టౌన్: మాదక ద్రవ్యాలతో సహా ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంతర్జాయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మిషన్ పరివర్తన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల మన ఆరోగ్యం పాడవడంతో పాటు చట్టప్రకారం శిక్షార్హులమవుతామని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రతీ జూనియర్, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, గంజాయి మొదలగు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కార్యక్రమాలను చేపడతామని అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె ప్రమోద్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్ మహిపాల్ రెడ్డి, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఏ సురేష్, పోలీస్, ఎక్సైజ్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావంపై అవగాహన కల్పించాలి..

పెద్దపల్లిటౌన్: డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పెద్దపల్లి ప్రిన్సిపాల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ డి హేమంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి సమీకృత జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో అదనపు కలెక్టర్‌లు జే అరుణశ్రీ, పీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి హేమంత్‌కుమార్ పాల్గొన్నా రు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కునారం రోడ్డు వద్ద మానవహారం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను డాక్టర్ డి హేమంత్‌కుమార్ ఈ సందర్భంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్‌లో సంత కాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సి ల్ ఎన్ శ్రీనివాస్, ఏసీపీ క్రిష్ణ, సీఐ క్రిష్ణ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్‌కుమార్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్ మహిపాల్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఎ సురేష్, జిల్లా న్యాయ సేవాధికార, పోలీస్, ఎక్సైజ్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

గోదావరిఖని, జూన్ 26: రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను ప్రతీ భారతీయుడు తెలుసుకోవాలని సింగరేణి రెస్క్యూ జనరల్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం ఎన్టీపీసీలో స్మార్ట్ టీం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అసమానతలను రూపుమాపడానికి రాజకీయ అధికారం కాకుండా రాజ్యాధికారం కోసం పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లును సభికులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో వివిధ కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంఘాల నాయకులు ముక్క సుదర్శన్, మాదాసి రామమూర్తి, కాసర్ల వెంకటస్వామి, పులి మోహన్, డీటీఎఫ్ శ్యామ్, అందుగుల రాజేశం, లక్ష్మణ్, రాజు, అంజయ్య, సంజీవరావు పాల్గొన్నారు.

ఆర్జీ-3 ఏరియా ఇంజనీర్‌గా శేఖర్‌బాబు

రామగిరి, జూన్ 26: సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియా ఇంజనీర్‌గా వై శేఖర్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏరియా ఇంజనీర్ ఏలీషా జీఎంగా పదోన్నతితో బదిలీ కాగా ఆయన స్థానంలో శేఖర్‌బాబు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు చేతుల మీదుగా పదవీ బాధ్యతల ఉత్తర్వులను స్వీకరించారు.

కన్వెయన్స్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించండి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 26: సింగరేణి కన్వెయన్స్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఎండీ బలరాంకు వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం హైద్రాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీని కలసి సమస్యలను వివరించారు. కన్వెయన్స్ డ్రైవర్లకు జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని, వేతనాలు ఇచ్చేలా చూడాలని కోరారు. సీఎంపీఎఫ్ పెండింగ్ డబ్బులు డ్రైవర్ల ఖాతాలో జమ అయ్యేలా చూడాలని, ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు చేయాలని నాయకులు కోరారు. సీఎండీని కలిసిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్‌కుమార్‌తో పాటు కాంట్రాక్టు వర్కర్స్ అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర తిరుపతి, అక్బర్‌అలీ ఉన్నారు.

ఏఎల్‌పీ గనిని సందర్శించిన జీఎం గురువయ్య

రామగిరి, జూన్ 26: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీ ప్రాజెక్టును బుధవారం సేఫ్టీ జనరల్ మేనేజర్(కార్పొరేట్) జీఎం గురువయ్య తనిఖీ చేపట్టారు. ప్రాజెక్టు పనిస్థలాల్లోని 3 సీమ్, పంచ్‌ఎంట్రి, లాంగ్‌వాల్‌లో పురోగతి పనులను పరిశీలించారు. అనంతరం ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, రీజియన్ సేఫ్టీ హెచ్‌ఎన్ గుప్తా సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఏరియా ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, అధికారులు వెంకటరమణ, రఘురాం, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు

పీఎఫ్, పెన్షన్ సమస్యలు పరిష్కరిస్తాం

రామగిరి, జూన్ 26: పీఎఫ్, పెన్షన్ సమస్యలు సత్వరం పరిష్కరిస్తామని గొదావరిఖని రీజినల్ కమీషనర్ హరి పచూరి అన్నారు. బుధవారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి రిజీనల్ కమిషనర్ హరి ముఖ్యఅతిథిగా హాజరై పీఎఫ్, పెన్షన్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగులు పీఎఫ్, పెన్షన్ సమస్యలను అధికారుల ఎదుట ప్రస్తావించగా వాటి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అధికారులు శ్రీనివాసులు, ముప్పిడి రవీందర్‌రెడ్డి, సాయి కృష్ణ, కామేష్, భారతి, అనిత, వెంకట్‌రెడ్డి, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీడీకే 1ఇంక్లైన్‌లో ఎస్‌డీఎల్ యంత్రాలు ప్రారంభం

గోదావరిఖని, జూన్ 26: ఆర్జీ-1 జీడీకే 1, 3 ఇంక్లైన్‌లో నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. యంత్రాలకు అధికారులు, యూనియన్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భూగర్భ గనిలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గతంలో ఉన్న జీడీకే 1ఇంక్లైన్‌లోని యంత్రాల జీవితకాలం ముగిసినందున నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను ఒక్కొక్కటి సుమారు రూ.60లక్షలతో మొత్తం రూ.3కోట్ల పైగా వెచ్చిచ కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఈ యంత్రాల వలన భవిష్యత్తులో నిర్దేశిత లక్ష్యాలు, రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతను ఏ ఆటంకము లేకుండా సజావుగా సాగాలన్నారు. ఈ యంత్రాల ద్వారా రక్షణకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించాలని తెలిపారు. ఈ సందర్భంగా గని ఆవరణలోని శ్రీ దుర్గ అమ్మవారి ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాంమోహన్, ఏరియ ఇంజనీర్ డీ వెంకటేశ్వర్ రావు, ఏజెంట్ బీ సైదులు, ఏజీఎం(పర్సనల్) సీహెచ్ లక్ష్మీనారాయణ, ఏరియా రక్షణ అధికారి బైద్య, ఎస్ఓఎస్ రమేష్, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, సీనియర్ పీఓ శ్రావణ్ కుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరి మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ సెక్రటరి ఆరెల్లి పోషం, నాయకులు స్వామి, జాయింట్ సెక్రటరి రంగు శ్రీను, ఏరియ సర్వే అధికారి, ప్రభాకర్, పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్

- మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి

మంథని, జూన్ 26: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ప్రజా ఎదుర్కొంటున్న సమస్యలను తన, అధికారుల దృష్టికి తీసుకురావటానికి, వాటి పరిష్కారం కోసం వెంటనే చర్యలు తీసుకోవడం కోసం మున్సిపల్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసినట్లు చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి వెల్లడించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలు, వైద్య, విద్యుత్ మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమాశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ పరంగా పట్టణ ప్రజలకు ఎలాంటి సహాయం, సమస్య పరిష్కారం కావాలన్న టోల్‌ఫ్రీ నంబర్ 966602954, 9059895197 కాల్ చేసి తెలియజేయాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ శాఖ సిబ్బందితో ఇనుప పోల్స్, చెట్లపై ఉన్న వైర్స్ లాంటివి ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా వార్డుకు సంబంధించిన వార్డు ఆఫీసర్స్ ప్రజల అవసరాలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కమీషనర్ గుట్టల మల్లిఖార్జునస్వామి, అధికారులు పాల్గొన్నారు.

● తైబజార్ వేలం..

మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తైబజాన్ బహిరంగ వేలం నిర్వహించగా శ్రీపతి రాజు రూ. 5.71 లక్షలకు తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కమీషనర్ గుట్టల మల్లికార్జునస్వామి పాల్గొన్నారు.

● వార్డుల్లో ఫాగింగ్..

మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు వార్డుల్లో దోమల నివారణ కోసం మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ స్ప్రే చేశారు. వర్షాకాలంలో దోమలు, ఈటలు ప్రబలి వాటి కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉండటంతో వాటి నివారణ కోసం ఫాగింగ్ చేస్తున్నారు.

బుచ్చయ్యపల్లిలో ఒకరికి డెంగ్యూ పాజిటివ్

ధర్మారం, జూన్ 26: ధర్మారం మండలం బుచ్చయ్యపల్లి గ్రామంలో బుధవారం ఒకరికి డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదు అయింది. డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు గుర్తించిన నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 58మందికి వైద్య పరీక్షలు చేసి, జ్వర పీడితులకు రక్త నమూనాలు సేకరించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఇళ్ల చుట్టు ఉన్న నీటి నిల్వలను తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేష్, మలేరియా నోడల్ పర్సన్ దామోదర్, డాక్టర్ గౌతమ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 26: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ దయ అరుణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దబొంకూర్‌లోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మహిళ సాధికరతా కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దయ ఆరుణ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, ఆడపిల్లలపై వివక్షత చూపవద్దని సూచించారు. బాల్య వివాహ నిషేధ చట్టం, సఖి సేవలు, సెల్ఫ్ డిఫెన్స్ పెంపొందించుకొని అన్ని రంగాల్లో ముందు ఉండాలన్నారు. హెల్ప్‌లైన్ నెంబర్లు, ఉన్నత చదువులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, మరియు స్వప్న , సంధ్య, సమత పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/ధర్మారం జూన్ 26: ఏబీవీపీ ఆధ్వర్యంలో కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ధర్మారంలో మండలంలో బుధవారం విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసురి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పేద మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ రిషి, వినయ్, నాగచంద్ర తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా చత్రపతి సాహు మహారాజ్ జయంతి

ఓదెల, జూన్ 26: మండలంలోని కొలనూర్‌లో బుధవారం చత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన నేత సాతూరి అనిల్ మాట్లాడుతూ ప్రత్యేక పరిశోధనలతో వ్యవసాయ అభివృద్ధి కోసం రైతులకు మెలకువలు నేర్పిన చత్రపతి సాహు మహారాజ్ పాలన ఈ దేశానికి ఆదర్శమని అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. నాయకులు పల్లె సుమన్, సాతూరి నరేష్, మాటూరి నరసయ్య, పల్లె ప్రశాంత్, దీకొండ మల్లయ్య, జీదుల పాపయ్య, కల్లేపల్లి రాజ్ కుమార్, మాటూరి అజయ్ పాల్గొన్నారు.

'ఇసుక లారీల పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే'

ముత్తారం జూన్ 26: ఇసుక లారీల పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇసుక రీచులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేశారన్నారు. చెక్‌డ్యాముల పేరుతో మానేరు పరివాహక ప్రాంత రైతులను మోసం చేసి కోట్లాది రూపాయల ఇసుక అమ్ముకున్న ఘనత బీఆర్ఎస్ నాయకులది అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గాన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ జరపాలి: కలెక్టర్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కోల్‌సిటీ, జూన్ 26: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ జరిపి పారిశుధ్య చర్యలను మెరుగు పర్చాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కమిషనర్ శ్రీకాంత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్య విభాగంలో చెత్త సేకరణ, అందుబాటులో ఉన్న వాహనాలు, కార్మికుల సంఖ్య గురించి అడిగి తెలుసుకున్నారు. కార్పొరేషన్‌లో ఇంటింటా చెత్త సేకరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని, దీనికి అవసరమైన వాహనాలు, సిబ్బందిని సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మార్కెట్లు, వ్యాపార కేంద్రాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శుభ్రం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం సింగిల్ యూజెస్ ప్లాస్టిక్‌ను నివారించాలన్నారు. నగరంలో వివిధ పథకాల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన స్కీముల వారీగా సమీక్ష జరిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు సకాలంలో వినియోగించుకోకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. టీయూఎఫ్‌ఐడీసీ పనులు అగ్రిమెంట్ అయిన వెంటనే ప్రారంభించాలని, గడువులోగా పూర్తయ్యేలా ఇంజనీర్లు చర్యలు చేపట్టాలన్నారు. అమృత్ నిధులతో చేపట్టబోయే ఎస్టీపీల పనులు షెడ్యూల్‌లోగా పూర్తికావాలని, ఎప్పటికప్పుడు పనుల పురోగతిని వివరించాలని ప్రజారోగ్య శాఖ ఈఈ సంపత్‌రావును ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం పనితీరును మెరుగుపర్చుకోవాలని, కమిషనర్ ఈ మేరకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నగరంలో రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రి, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో మహిళా సంఘాల ద్వారా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని, బ్యాంకర్లను సంప్రదించి బ్యాంకు లింకేజీలతో త్వరితగతిన ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టబోయే పనుల్లో వేగం పెంచాలన్నారు. నెల రోజుల్లో పెయింటింగ్ బృందాలు నగరానికి వస్తాయని, ఈ లోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎస్ఈ చిన్నారావు, ఈఈలు రామన్, సుచరణ్, అదనపు కమిషనర్(రెవెన్యూ) రాయలింగం, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖ ఈఈ సంపత్‌రావు, ఏఈ మౌనిక, ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ

పాలకుర్తి, జూన్ 26: రామగుండం ఎమ్మెల్యేగా పాలకుర్తి మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్ తెలిపారు. మక్కాన్‌సింగ్ గెలిచిన వెంటనే బసంత్‌నగర్ నుంచి ఈసాలతక్కళ్లపల్లి సమ్మక్క, సారలమ్మల దేవస్థానం వరకు కోటి అర్థై లక్షల రూపాయలతో డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా డబుల్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారన్నారు. ఎంపీపీ వెంట మాదాసు శ్రావణ్, ఆడెపు రామకృష్ణ, ఆడెపు శ్రీధర్ ఉన్నారు.

'కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ'

మంథని, జూన్ 26: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన కునుకుంట్ల సమ్మయ్య, మహాముత్తారం మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన గంద్ర కిషన్‌రావులు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాలకు తన నివాసంలో పార్టీ ప్రమాద బీమ చెక్కులను రూ.2 లక్షల చొప్పున బుధవారం పుట్ట మధు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

బార్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు

పెద్దపల్లిటౌన్, జూన్ 26: పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్ళలో బుధవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వంట గదుల పరిశుభ్రత, ఆహార నిల్వలను పరిశీలించారు. నిబంధనలు పాటించని బార్ అండ్ రెస్టారెంట్‌లు, హోటళ్ళకు 5 వేల రూపాయల చొప్పున జరిమానా వేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు డి రమాకాంత్, పి.అనిల్ కుమార్, లక్ష్మీనర్సయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంమ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు

'ప్రజాస్వామ్యానికి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం'

పెద్దపల్లిటౌన్, జూన్26: ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ విమర్శించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ అధ్య క్షతన ఎమర్జెన్సీ వ్యతిరేక దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించారన్నారు. కార్యక్రమంలో రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షీలారపు పర్వతాలు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూప్‌రెడ్డి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మారం ఉప కేంద్రంలో నూతన ఫీడర్ ఏర్పాటు

ధర్మారం, జూన్26: ధర్మారం 33/11కెవి విద్యుత్ ఉప కేంద్రంలో నూతనంగా ఫీడర్, బ్రేకర్(వీసీబి)ని బుధవారం ఏర్పాటు చేశారు. గతంలో మేడారం, గోపాల్‌రావుపేట గ్రామాలకు ఒకే ఫీడర్, బ్రేకర్(వీసీబి) ద్వారా విద్యుత్ సరఫరా జరగడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కల్గింది. నూతనంగా 1.80కిమీ. 11కెవి లైన్ ద్వారా నూతన బ్రేకర్‌ను ఎన్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ సుదర్శన్ మంజూరు చేయడంతో బుధవారం డివిజనల్ ఇంజనీర్ దాసరి తిరుపతి ప్రారంభించారు. ధర్మారం ఉప కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్, బ్రేకర్‌ల ద్వారా మండలంలోని మేడారం, గోపాల్‌రావుపేట, గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని ఏఈ ఖాసీం తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఇంజనీర్ కనకయ్య, ధర్మారం, ఖిలావనపర్తి ఏఈలు ఖాసీం, సురేష్, సబ్ ఇంజనీర్లు సతీష్, అనిల్, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ఓదెల, జూన్ 26: గుంపులలో వైకుంఠధామాన్ని నేలమట్టం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోకుంటే కొద్ది రోజుల్లోనే నిరసన కార్యక్రమాలను ప్రారంభిస్తామని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని గుంపులలో ఈనెల 19న శ్మశానవాటికను ధ్వంసం చేసిన ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గుంపులలో నిందితులపై చర్యలు తీసుకోవాలని నిర్వహిస్తున్న దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా సహాయ కార్యవాహ ఉయ్యాంకార్ సాయి, సకినాల కృష్ణ, నిరంజన్, చిరంజీవి, వెంకటేష్, శ్యామ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వంట సామగ్రి అందజేత

ముత్తారం, జూన్ 26: మండలంలోని పారుపల్లి ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని పాఠశాలకు పది వేల విలువ గల మధ్యాహ్న భోజన వంట సామగ్రిని గోదావరిఖని ఏసీపీ రమేష్, మంథని సీఐ వెంకటేశ్వర్లు, ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేగోళపు సదానందంగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ముత్తారం మండల నోడల్ ఆఫీసర్ ఇరుగురాల ఓదెలు, ఎంపీఓ వేణు మాధవ్, ఉపాధ్యాయులు కానుగంటి అంజయ్య, ఏపీసీ చైర్మన్ శ్రీమతి శోభ, గ్రామ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం

కోల్‌సిటీటౌన్, జూన్ 26: నీట్ ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ డీవైఎఫ్ఐ, ఎస్ఎస్‌యూఐ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాగర్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి దుర్గ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు ఎంతో కష్టపడి నీట్ పరీక్ష రాయగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సంస్థ నిర్లక్ష్యం కారణంగా లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ సిట్టింగ్ జడ్జితో జరిపించాలని దోషులను కఠినంగా శిక్షించి తిరిగి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కృష్ణ, శివ, శంకర్, సూర్య, ఎస్ఎస్‌యూఐ నాయకులు వినోద్, రఘు, శ్రవణ్, రాజ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి అభినందన

కోల్‌సిటీటౌన్, జూన్ 26: ఇటీవల విడుదలయిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన కన్నాపురం స్ఫూర్తి హెచ్ఈసీలో 500 మార్కులకు గాను 493 మార్కులు సాధించింది. రాష్ట్రంలోనే అత్యధిక మార్కుల స్థానంలో నిలిచింది. కాగా బుధవారం కళాశాల ఆవరణలో స్ఫూర్తిని అభినందిస్తూ ప్రిన్సిపాల్ అంజయ్య శాలువతో కప్పి సత్కరించారు. ద్వితీయ సంవత్సరంలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కో ఆర్డినేటర్ లైబ్రేరియన్ రాచకట్ల విజయ, ఎన్ఎస్ఎస్ ఇంచార్జీ శంకర్, అధ్యాపకులు వెంకటప్పయ్య, రజిత, సుమలత, జుబేదాభానుబేగం, నరేష్, సంపత్, స్ఫూర్తి తండ్రి నాగేందర్ పాల్గొన్నారు.

డీజిల్ కుంభకోణంపై విచారణ జరిపించండి

కోల్‌సిటీ, జూన్ 26: రామగుండం నగరపాలక సంస్థలో డీజిల్ వినియోగంలో కుంభకోణం చోటు చేసుకుంటుందని, దీనిపై విచారణ జరిపి బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మద్దెల దినేష్, ఏఐటీయూసీ నాయకులు ఎంఎ గౌస్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రతి నెల రూ.5 లక్షల వరకు డీజిల్ పక్కదారి పడుతుందన్నారు. ఈ అవినీతి అధికారికి ముఖ్యఅధికారులు అండగా నిలుస్తున్నారని, అతన్ని సస్పెండ్ చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పనిముట్లు, సబ్బులు, గ్లౌజులు అందించాలన్నారు.

మున్సిపల్, జీపీ కార్మికుల ధర్నా

పెద్దపల్లిటౌన్, జూన్ 26: మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూరాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు సీపెల్లి రవీందర్, కల్లేపల్లి అశోక్ మాట్లాడుతూ మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, మహంకాళి సురేష్, బొంకూరి సాగర్, నాయకులు లక్ష్మణ్, గట్టయ్య, రాధాకృష్ణ, గుడిసెల లక్ష్మి, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ కాజా పాల్గొన్నారు.

అవార్డుల ప్రధానోత్సవం

కమాన్‌పూర్, జూన్ 26: హెల్పింగ్ హ్యాండ్ నేచర్ వ్యవస్థాపకుడు నారగొని సతీష్, మహమ్మద్ యూసుఫ్ బుధవారం హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ బాషా సాంస్కృతిక సౌజన్యంతో వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులను అందుకున్నారు. ఈ అవార్డును జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి, దక్కన్ ల్యాండ్ బాల చెలిమి సంపాదకులు వేదకుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుకు ఎంపిక చేసిన అధ్యక్షులు చదువు వెంకటరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు మధుకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.